క్లుప్తంగా

వేంపల్లె పంచాయతీ ఈఓగా నాగభూషణంరెడ్డి



వేంపల్లె : స్థానిక గ్రామ పంచాయతీ ఈఓగా నాగభూషణంరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారిణి రాజ్యలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. గత మార్చిలో పంచాయతీ ఈఓగా వెంకటసుబ్బారెడ్డి అవినీతికి ఆరోపణలతో సస్పెండ్ అయ్యారు. అప్పటి నుంచి ఏడు నెలలుగా పర్మినెంట్ ఈఓ లేకపోవడంతో డ్రైనేజీ, పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. టీడీపీ నేతల వర్గపోరుతో ఏ అధికారి ఇక్కడ పనిచేసేందుకు సుముఖత చూపలేదు. ఏ మొగుడు లేనప్పుడు అక్క మొగుడే దిక్కు అని గతంలో ఇదే పంచాయతీలో అవినీతికి పాల్పడి సస్పెండ్ అయిన నాగభూషణ్‌రెడ్డిని మరలా ఈఓగా బాధ్యతలను అప్పగించారు. దొంగ బిల్లులు ఇచ్చి ప్రజలను మోసం చేసి కోట్ల రూపాయల నగదును సొమ్ము చేసుకున్నారు. ఇంటికి సంబంధించి ప్లాన్ అప్రూవల్, కుళాయి కనెక్షన్లకు బిల్లులు ఇవ్వకుండా ఇష్టానుసారంగా కనెక్షన్లు ఇచ్చి అనుమతులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో అవినీతికి పాల్పడినట్లు అధికారులు ధృవీకరించి సస్పెండ్ చేశారు. ఈఓ మాట్లాడుతూ సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు, వార్డు సభ్యులు, అన్ని పార్టీల నాయకులు, ప్రజల సహకారంతో వేంపల్లెని స్వచ్ఛ పంచాయతీగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తామన్నారు.

18 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరు

కమలాపురం : మండలానికి 18 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరైనట్లు ఏఓ సరస్వతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్‌కు 4.5 టన్నులు, మన గ్రోమోర్‌కు 4.5 టన్నులు, నాగార్జున ఫెర్టిలైజర్స్‌కు 4.5 టన్నులు, జూటూరు సుబ్బారావు దుకాణాలకు 4.5 టన్నుల యూరియా మంజూరైందని ఆమె తెలిపారు. శుక్రవారం 9 గంటల నుంచి యూరియా పంపిణీ చేపడుతామన్నారు. కావలసిన రైతులు సంబంధిత దుకాణాలకు వెళ్లి తీసుకోవచ్చని తెలిపారు. అలాగే కమలాపురం -2 ఆర్‌ఎస్‌కే, ఎర్రగుడిపాడు ఆర్‌ఎస్‌కేలలో 40 టన్నుల జిప్సం అందుబాటులో ఉందని ఏఓ తెలిపారు. జిప్సం బ్యాగ్ ధర రూ.255 ఉండగా రూ.75 సబ్సిడీ పోను మిగిలిన రూ.180 చెల్లించి రైతులు తీసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

ఈ-నామ్ విధానాన్ని పరిశీలించిన ఆర్డీఓ



ఈ-నామ్ విధానాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ, మార్కెట్ యార్డు చైర్మన్

పులివెందుల రూరల్ : పట్టణంలోని చీనీ కాయల మార్కెట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ-నామ్ విధానాన్ని గురువారం ఆర్డీఓ చిన్నయ్య మార్కెట్ యార్డు చైర్మన్ అమర్నాథ్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఈ-నామ్ విధానం ద్వారా ఎవరైనా వేలం పాటలో పాల్గొనవచ్చునని, ఈ విధానంలో ప్రతి ఒక్కరికి ఐడెంటి కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. వ్యాపారస్తుల మధ్య పోటీతత్వం పెరిగి చీనీ కాయలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఓ రాఘవేంద్ర, రైతులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

కిరణ్మయికి రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం



బంగారు పతకాన్ని అందుకుంటున్న విద్యార్థిని కిరణ్మయి

వేంపల్లె : పట్టణానికి చెందిన కల్లూరు కిరణ్మయి కడప రిమ్స్ కళాశాలలో ఎంబీబీఎస్ నాల్గవ సంవత్సరం చదువుతోంది. అయితే ఆ విద్యార్థికి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో అనాటమీ విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం పొందింది. విజయవాడలో తుమ్మలపల్లె వారి క్షేత్రీయ కళాక్షేత్రంలో బుధవారం డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ యాజమాన్యం బంగారు ప్రదానం చేసింది. ఏపీ గవర్నర్ నజీర్, ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్, ముఖ్య అతిథి డాక్టర్ ఒపి యాదవ్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని విద్యార్థిని కిరణ్మయి అందుకున్నారు. విద్యార్థిని కిరణ్మయి బంగారు పతకం సాధించడంపట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజలకు వైద్య పరీక్షలు

లింగాల : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య సిబ్బంది గురువారం మెడికల్ క్యాంపు నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

మాజీ సర్పంచ్ మృతి

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు హుస్సేన్ భార్య మాజీ సర్పంచ్ కె.మస్తాన్‌బీ(58) అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. ఇటీవల సర్పంచ్ పదవికి రాజీనామా చేసి ఇంటి వద్ద విశాంత్రి పొందుతూ మృతి చెందింది. పలుపురు నివాళి అర్పించారు.

ఆర్టీపీపీ ఆసుపత్రిలో వేధిస్తున్న మందుల కొరత

- ఇబ్బందులు పడుతున్న ఆర్టీపీపీ ఉద్యోగులు, కార్మికులు
- ప్రొద్దుటూరు ఆసుపత్రులకు పరుగులు
- ఆర్టీపీపీ ప్రాజెక్టు ఆసుపత్రిని భవ్య సంస్థకు అప్పగించడంపై వ్యతిరేకిస్తున్న ఉద్యోగులు, కార్మికులు



ఆర్టీపీపీలోని ప్రాజెక్టు ఆసుపత్రి

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో ఉన్న ప్రాజెక్టు ఆసుపత్రి పేరుకు మాత్రమే అన్నట్లు ఉంది. అక్కడ వైద్య సేవలకు వేస్తే అంతే సంగతులు అని ఆర్టీపీపీలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు వాపోతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏపీజెన్‌కో పరిధిలో ఉన్న ఆర్టీపీపీలోని ప్రాజెక్టు ఆసుపత్రిని భవ్య సంస్థకు అప్పగించారు. గతంలో యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పరిధిలో సుమారు 11 ఏళ్లుగా ఉండేది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత భవ్య సంస్థలకు అప్పగించారు. నెలకు రూ.15 లక్షలు చొప్పున ఏపీజెన్‌కో యజమాన్యం భవ్య సంస్థకు ఇస్తోంది. కూటమిలో ప్రముఖ్య వ్యాపారవేత్తకు అప్పగించారు. భవ్యకు అప్పగించిన తర్వాత ఆసుపత్రిలో ఎలాంటి వైద్య సేవలు అందలేదని కార్మికులు, ఉద్యోగులు వాపోతున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో మందుల కొరత తీవ్రంగా ఉంది. ఈ ఆసుపత్రిలో నలుగురు వైద్యులతో పాటు 31 మంది స్టాఫ్ పనిచేస్తున్నారు. ఈ విషయంపై ప్రాజెక్టు ఆసుపత్రి వైద్యుడు ముస్తాఫాను గురువారం సాక్షి వివరణ కోరగా.. ప్రస్తుతం భవ్య అనే సంస్థ పరిధిలో ఆసుపత్రి నడుస్తుందన్నారు. ఇక్కడ మందుల కొరత ఉందన్నారు. జనరల్ మెడిసిన్ తోపాటు ఇతర వ్యాధులకు సంబంధించిన మందులు కావాలని భవ్య సంస్థకు ప్రతిపాదనలు పంపామన్నారు. త్వరలో మందులు వస్తాయన్నారు.

చెరువును తలపిస్తున్న పాఠశాల మైదానం



వర్షం నీటితో నిండిన ముద్దనూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం

ముద్దనూరు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వర్షంనీటి నిల్వతో చెరువును తలపిస్తోంది. కొద్దినెలల క్రితం లక్షల వ్యయంతో మైదానంలో అభివృద్ధి పనులుచేపట్టినా ఫలితంలేదని విద్యార్థులు వాపోతున్నారు. గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో మైదానం నీటిమయంగా మారింది. మైదానంలోని వాలీబాల్ కోర్టు, వాకింగ్ ట్రాక్‌లు గుంతలమయంగా మారి అధ్వానంగా వున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కోడిగాండ్లపల్లెలో రిమ్స్ రాపిడ్ వైద్య బృందం



వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు

ముద్దనూరు : మండలంలోని కోడిగాండ్లపల్లెలో జ్వరాల వ్యాప్తిని అరికట్టడానికి కడప రిమ్స్ వైద్యశాల రాపిడ్ వైద్య బృందం గురువారం పర్యటించింది. గ్రామంలో జ్వరాలు అధికంగా వుండటంతో సుమారు 30 మంది వైద్య బృందం ఇంటింటికి తిరిగి లారీ సర్వే, ఫీవర్‌సర్వేలు చేపట్టారు. జ్వరం బారిన పడిన బాధితులను పరీక్షించారు. ఇందులో 35 మందికి రక్త పరీక్షలు, 5 మంది రక్త నమూనాలు సేకరించి కడప రిమ్స్‌లో డెంగీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. గతంలో జ్వరాల బారిన పడి కోలుకుంటున్న వారిని పరీక్షించారు. గ్రామంలో జ్వరాలు అదుపులోకి వచ్చే వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ పర్యటనలో రిమ్స్‌కు చెందిన ప్రిన్సిపాల్ జమున, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ సురేష్‌రెడ్డి, నవాజ్, ఖలీఫ్, కిషోరరెడ్డి, ఎంపీడీవో రాధాకృష్ణకుమారి, మలేరియా అధికారి వెంకటరెడ్డి, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేముల ఎంపీడీఓగా గంగాదేవి



వేముల : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బి.గంగాదేవి నియమితులయ్యారు. ఇక్కడ పులివెందుల ఎంపీడీఓ కృష్ణమూర్తి ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహించేవారు. దీంతో చెన్నూరు మండలంలో ఏఓగా పనిచేస్తున్న బి.గంగాదేవి పదోన్నతిపై వేముల ఎంపీడీఓగా బదిలీపై వచ్చారు. దీంతో ఆమె గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధికి కృషి చేస్తాననన్నారు. అనంతరం ఆమె ఎంపీపీ చల్లా గంగాదేవిని కలిశారు.

జెండా మాను కట్ట నిర్మాణానికి విరాళం

సింహాద్రిపురం : మండలంలోని బలపనూరు గ్రామంలో ఉన్న మాబు సుభాని జెండా మాను కట్ట నిర్మాణానికి విరాళం అందించారు. గురువారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి గ్రామ ముస్లిం నాయకులు ఇమామ్‌బాషా, మహమ్మద్ రఫీ, బాబ్‌జాన్, అబ్దుల్, బాబావలిలకు రూ.25వేల నగదును అందించారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణురాలు రాక

– అందుబాటులో ప్లాస్టిక్ సర్జరీ సేవలు

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ శుక్రవారం ఉదయం 11.45గంటల నుండి మధ్యాహ్నం 3 గంటలవరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పేదాలు, నోట్లో పక్కులు సలిపిరి, తల్లి (అమ్మవారు), సబ్యం(శోభి), మాగురు(మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కోరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ ఉదయం 9.45 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వరపేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ప్రముఖ ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణురాలు డాక్టర్ దీప్తి బత్సు ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం వరకు కాస్మెటిక్ సర్జరీ, హ్యాండ్ సర్జరీ, మైక్రో వ్యాస్కులర్ సర్జరీ, ట్రామా రీకంస్ట్రక్షన్, బర్న్ సర్జరీ, డయాబెటిక్ ఫూట్ సర్జరీ, క్రానియో ఫేషియల్ సర్జరీ, అన్యో రీకంస్ట్రటివ్ సర్జరీ సేవలు అందిస్తారన్నారు. చర్మవ్యాధుల వైద్యనిపుణులు డాక్టర్ ఈనెల 14వ తేదీ ఆదివారం ఉదయం 10గంటల నుండి ఓపీలో అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

10 అంశాలకు కౌన్సిల్ ఆమోదం



సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మేరి

కమలాపురం : నగర పంచాయతీ పరిధిలోని 10 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మార్పురి మేరి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఇందులో మున్సిపల్ సిబ్బంది చదివి వినిపించిన 10 అంశాలను కౌన్సిలర్ల సమక్షంలో ఆమె ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా నాన్ పీహెచ్ వర్కర్స్‌కు పెంచిన వేతనాలు చెల్లించుటకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అలాగే పట్టణంలో చాలా చోట్ల వీధి దీపాలు వెలగడం లేదని, వీధి దీపాల ఏర్పాటుకు రూ.2లక్షలు వెచ్చించాడానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు డీఎంఎఫ్ గ్రాంటు ద్వారా రూ.2 కోట్లు పొందడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వాటిని కలెక్టర్ కార్యాలయానికి పంపడానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 13వ వార్డులో డ్రైనేజ్ నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రూ.3.26 లక్షలు చెల్లించడానికి రూపొందించిన అంచనాలను కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్, రేబీస్ వ్యాక్సిన్ చేయించుటకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కాగా ఆమె మాట్లాడుతూ ఈ సమావేశంలో 10 అంశాలకు ఆమోదం తెలిపామన్నారు. ముఖ్యంగా డ్రైనేజ్ కాలువల్లో పూడిక తీసి వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చేయాలన్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, పారిశుద్ధ్యం పట్ల నిర్లక్ష్యం వహించవద్దన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మహ్మద్ సాదిక్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నష్టపరిహారంలో దళితులకు న్యాయం చేయాలి



తహసీల్దార్ హరినాథరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న దళిత మహిళలు

వేంపల్లె : 440 జాతీయ రహదారిలో ఇంటి స్థలాలు కోల్పోయే దళితులకు నష్ట పరిహారంలో న్యాయం చేయాలని దళిత మహిళలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద దళిత మహిళలు జాతీయ రహదారిలో ఇంటి స్థలాలు కోల్పోయే బాధితులకు నష్టపరిహారం అందించాలని ధర్నా నిర్వహించారు. అలాగే తహసీల్దార్ హరినాథ్‌రెడ్డికి కబ్జాదారుల నుండి కాపాడి రహదారి పనుల్లో ఇంటి స్థలాలు కోల్పోయే దళితులకు నష్ట పరిహారం మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న దళితులు వేంపల్లె గ్రామ పోలంలోని 164, 165 సర్వే నెంబర్లులో 92 మందికి ఒక్కొక్కరికి 5 సెంట్లు చొప్పున ఇంటి స్థలం కలిగి ఉన్నట్లు దళితులు తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. 1997లో ప్రభుత్వానికి చలానా కట్టి ఆ భూమిని ప్లాట్లుగా విభజించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కూడా చేసుకోవడం జరిగిందని, ప్లాట్లలో కొంత మంది గృహాలు కూడా నిర్మించుకున్నట్లు చెప్పారు. అయితే దళితుల స్థలాన్ని కబ్జా చేసేందుకు గౌసియా, అమీరున్‌కు చెందిన అనుచరులు ప్రయత్నాలు చేయడంతోపాటు జాతీయ రహదారి ద్వారా వచ్చే నష్టపరిహారం రాకుండా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, జాతీయ రహదారిలో దళితులకు చెందిన ఇంటి స్థలాలు కోల్పోయే వారందరూ డ్యాకుమెంట్లు కూడా అందజేశారన్నారు. ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు పేర్లు నష్టపరిహారంలో ప్రకటించడం జరిగిందని, జాతీయ రహదారిలో ఇంటి స్థలాలు పోయే పేద దళితులమైన వారికి పరిహారం వచ్చే విధంగా చేయాలన్నారు. స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ జాతీయ రహదారిలో ఇంటి స్థలాలు, భూములు కోల్పోయే వారి డ్యాకుమెంట్లను జాయింట్ కలెక్టర్‌కు పంపడం జరిగిందని, ప్రస్తుతం భూములు కోల్పోయే వారికి మాత్రమే నష్ట పరిహారం లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలలో పడుతుందన్నారు. ఇంటి స్థలాలు కోల్పోయే వారికి ఇంకా నష్టపరిహారం పడలేదని, డ్యాకుమెంట్ ఇచ్చిన వారందరికి పరిహారం వస్తుందని ఎవరూ అపోహ పెట్టుకోవద్దన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ రామాంజనమ్మ, మాజీ ఎంపీటీసీ నాగన్న, దళిత నాయకుడు ఇల్లూరు పుల్లయ్య, బాధిత మహిళలు పాల్గొన్నారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

పులివెందుల టౌన్ : 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని ఏపీ ఎన్‌జీవో సంఘ అధ్యక్షుడు జగన్నాథరెడ్డి తహసీల్దార్‌ను కోరారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద పాత పెన్షన్ సాధన కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులతో కలిసి ఆయన మహా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తహసీల్దార్ నజీర్ అహమ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్‌జీవో సంఘ పులివెందుల అధ్యక్షుడు జగన్నాథరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్ పునరుద్ధరించాలని ఉపాధ్యాయ తాలూకా కేంద్రం వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవో సంఘ జిల్లా కన్వీనర్ బండి నాగేశ్వరరెడ్డి, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు

కొండాపురం : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఉద్యోగ మేళాలో నిరుద్యోగులకు ఎఐఎల్ డిక్సాన్ కంపెని ప్రతినిధులతో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ నాగప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని వెలుగు సభా భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కడప కొప్పర్తిలోని డిక్సాన్ కంపెని సంస్థలో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన 18–32 సంవత్సరాల యువతీ, యువకులు 172 మందికి ఇంటర్యూవ్యలు నిర్వహించామన్నారు.

వేంపల్లి ప్రభుత్వాసుపత్రి సమస్యలను పరిష్కరించండి

వేంపల్లె : ఐదు మండలాలకు కూడలిగా ఉన్న వేంపల్లె ప్రభుత్వాసుపత్రిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఆరోగ్య, వైద్య, విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ కోరారు. గురువారం గండిక్షేత్రానికి విచ్చేసిన మంత్రిని కలసి సమస్యలను విన్నవించారు. ఈ ఆసుపత్రికి ప్రతినిత్యం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 500 మంది రోగులు చికిత్సలకు వస్తుంటారన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.9 కోట్లతో చేపట్టిన ఆసుపత్రి విస్తరణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయని, వైద్య సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ సర్వీసెస్ పరీక్షలపై అవగాహన

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీలో గేట్, క్యాట్, జీమ్యాట్ ఇంజినీరింగ్ సర్వీసెస్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం ట్రిపుల్‌ఐటీ పోటీ పరీక్షల విభాగం అధికారి కోనప్ప ఆధ్వర్యంలో కెరియర్ డెవలప్మెంట్ సహకారం, ప్రముఖ అంతర్జాల విద్యా వేదిక ఫిజిక్స్ వారిచే సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామిగుప్తా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ భవిష్యత్ కెరీర్ లక్ష్యాలపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఫిజిక్స్ వాలా విద్యా సంస్థల అధ్యాపకులు ఆధార్ఫ్ రషీద్, రతన్‌లు విద్యార్థులకు అవసరమైన సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ ఏఓ రవికుమార్, అకాడమిక్ డీన్ రమేష్ కైలాస్, ప్లేస్మెంట్ అధికారి సుందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

16న విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

తొండూరు : స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 16వ తేదీన ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం చేస్తారని కళాశాల ప్రిన్సిపాల్ వై.వెంకటరెడ్డి తెలిపారు. ఐటీఐ కోర్సు పూర్తైన విద్యార్థులకు అదే రోజు ఉద్యోగ నియామకాల కొరకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, ఈ కార్యక్రమానికి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. ఈ ఇంటర్వ్యూలకు గతంలో పాసైన విద్యార్థులు కూడా పాల్గొనవచ్చునని తెలిపారు.

యూరియా ఉన్నా రైతులకు ఇవ్వని అధికారులు

పులివెందుల రూరల్ : రైతులు సాగు చేసిన పంటలకు యూరియా చాలా అవసరం. యూరియాను సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. యూరియాను అరకొరగా సరఫరా చేస్తుండటంతో దాని కోసం పలు ప్రాంతాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పులివెందుల మండలం ఎర్రబల్లె రైతు భరోసాకేంద్రం-2లో యూరియా స్టాకు ఉన్నా సంబంధిత అధికారులు మాత్రం యూరియాను రైతులు అడుగుతున్నా పంపిణీ చేయడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులు కావాల్సిన యురియాను సకాలంలో పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఏఓ చెన్నారెడ్డిని వివరణ కోరగా ఎర్రబల్లె గ్రామ పంచాయతీలో రెండు రైతు భరోసా కేంద్రాలు ఉండగా.. ఒక కేంద్రానికి యూరియా రావడం జరిగిందని, మరో రైతు భరోసా కేంద్రానికి రెండు రోజుల్లో యూరియ వస్తుందని, వచ్చిన వెంటనే రైతులందరికీ పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

వరిలో కాలి బాటలు తప్పనిసరిగా తీయాలి



దాదిరెడ్డిపల్లెలో వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి

కమలాపురం : రైతులు వరి పంటలో సమగ్ర ఎరువు యాజమాన్య, సస్యరక్షణ పద్ధతులను పాటించాలని, అలాగే వరి పంటలో తప్పనిసరిగా కాలిబాటలు తీయాలని ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి తెలిపారు. గురువారం మండలంలోని దాదిరెడ్డిపల్లెలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారు రైతులకు సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. మట్టి పరీక్షల ఆధారంగా సిఫారసు చేసిన ఎరువులను మాత్రమే వాడాలన్నారు. విత్తన శుద్ధి తప్పని సరిగా చేయాలన్నారు. వరి పంటలో ప్రతి 2 మీటర్లకి 30 సెం.మీ. చొప్పున కాలి బాటలు తీసుకోవాలని, నారు కొనలు తుంచి ప్రధాన పొలంలో నాటాలన్నారు. దీని ద్వారా కాండం తొలుచు పురుగును నివారించవచ్చన్నారు. కాలిబాటలు తీయడం వలన మొక్కలకు మంచి గాలి, వెలుతురు అందడంతో పాటు దోమపోటును నివారించవచ్చన్నారు.

నేడు మండల సర్వ సభ్య సమావేశం

ఎర్రగుంట్ల : మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీడీఓ సభా భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు వారి అభివృద్ధి నివేదికలతో హాజరుకావాలన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చింతకొమ్మదిన్నె : వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్లో ఈనెల 11న జరిగిన అండర్-14, 17 జిల్లాస్థాయి బాలబాలికల స్విమ్మింగ్ పోటీలలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరు మంది విద్యార్థులు వివిధ విభాగాలలో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి తెలిపారు. పాఠశాలలో చదివే యు.ఇమ్రాన్, కే.మాలిక్, జి.గణేష్‌రెడ్డి, జి.కపిల్, జె.హేమసాగర్, ఆర్.సుశాంత్‌లు వివిధ పోటీల విభాగాలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఇందుకు కృషి చేసిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నాగార్జునకు, విద్యార్థులకు ఉపాధ్యాయ బృందంకు అభినందనలు తెలిపారు.

యూరియా గోడౌన్‌పై ఆకస్మిక తనిఖీ



ఆర్‌ఎస్‌కేలో యూరియా బస్తాలను పరిశీలిస్తున్న చంద్రానాయక్

పులివెందుల రూరల్ : మండలంలోని అచ్చివెల్లి గ్రామం రైతు సేవా కేంద్రాన్ని గురువారం జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు బి.చంద్రానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేసి నిల్వ ఉన్న యూరియా బస్తాలను, స్టాకు రిజిష్టర్‌కు, డీబీటీలో ఉన్న యూరియా బస్తాలకు వ్యత్యాసం ఏమైనా ఉన్నాయా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ రైతులతో ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు యూరియా కాకుండా ఇతరత్రా అవసరమైన ఎరువులను కూడా రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జికి తెలియజేస్తే వాటిని అందుబాటులో ఉంచుతామన్నారు. పులివెందుల ప్రైవేట్ ఎరువుల దుకాణాలను పరిశీలించి అందులో కూడా యూరియా నిల్వలను తనిఖీ చేశారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందకుండా ప్రస్తుత అవసరాలకు మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరద ఉధృతికి కొట్టుకుపోయిన రోడ్డు



జమ్మలమడుగు రూరల్ : మండలంలోని ఎస్.ఉప్పలపాడు-గుండ్లకుంట రహదారిలో ఉన్న ఇసుక వంక వరద ఉధృతికి రహదారి కొట్టుకు పోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, కర్నూల్‌కు వెళ్లవలసిన ప్రయాణికులు 4 గంటల పాటు ఇబ్బందులకు గురయ్యారు. తహసీల్దారు జోక్యం చేసుకుని ఆర్టీసీడీఎంతో మాట్లాడి రామిరెడ్డిపల్లె రహదారి గుండా ఆర్టీసీ బస్సులను పునరుద్దరించారు.

ఎయిడ్స్‌పట్ల అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి

పులివెందుల టౌన్ : ఎయిడ్స్‌పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్య, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయిడ్స్, సుఖ వ్యాధులు, క్షయ వ్యాధి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. సీడీఎస్ ప్రాజెక్టు మేనేజర్ వల్లి ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులపట్ల వివక్షత, చిన్నచూపు లేకుండా సమాజంలో కలిసి జీవించాలన్నారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాల అలవాటుకు యువత దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీడీఎస్ సిబ్బంది పుష్పరాజు, మేరీ, అనురాధ, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.